క్లుప్తంగా

వైభవంగా విశ్వేశ్వరుని కల్యాణం



పాత గుంటూరు: బ్రాడీపేట రెండోలైనులోని శ్రీగౌరీ విశ్వేశ్వరాలయంలో అనంతుగురు స్వామి జన్మనక్షత్రం సందర్భంగా దివ్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. జంధ్యాల పవన్‌కుమార్ శర్మ, వెంకటలక్ష్మి, మిట్టపల్లి అయ్యప్ప చక్రవర్తి, లక్ష్మీ ప్రశాంతి దంపతులతో అర్చకులు విశ్వేశ్వర శర్మ శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సుబ్రహ్మణ్య శాస్త్రి, మల్లికార్జున శర్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బీసీలకు అత్యధిక స్థానాలు కేటాయించాలి

నెహ్రూనగర్: ఏ రాజకీయ పార్టీ అయినా బీసీలకు ప్రతి పార్లమెంట్ సెగ్మెంట్‌లో మూడు స్థానాలు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు కుమ్మర క్రాంతికుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారే తప్ప వారికి చేసిందేమీ లేదని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో బీసీలకు ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మూడు స్థానాలు కేటాయించాలని, లేకుంటే బీసీలను ఏకగ్రీవంగా నిలబెట్టి గెలిపించుకుంటామని వివరించారు.

ఉద్యోగోన్నతుల్లో న్యాయం చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: గతేడాది జరిగిన ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్‌లో భాగంగా ఉద్యోగోన్నతికి విల్లింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయులు ఇంక్రిమెంట్లు వదులుకుని నెలకు రూ.2,500 అదనపు ఇస్తామని చెప్పి, ఐదు నెలలు పని చేసిన తరువాత ఉద్యోగోన్నతులను రద్దు చేయడం అన్యాయమని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ బదిలీల్లో అసంబద్ధ నిర్ణయాలను సవరించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ బదిలీ నిబంధనల్లో అసంబద్ధ నిర్ణయాలను సవరించాలని ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు సీహెచ్ జోసఫ్ సుధీర్ బాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో సంఘ గుంటూరు జిల్లా అధ్యక్షుడు గేరా మోహనరావు అధ్యక్షతన ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులపై నిర్వహించిన ఎస్టీయూ జిల్లా నాయకుల సమావేశంలో ముఖ్యఅతిథిగా జోసఫ్ సుధీర్ బాబు మాట్లాడుతూ ప్రమోషన్లు, బదిలీల విషయంలో విద్యాశాఖ వైఖరి, జారీ చేస్తున్న ఉత్తర్వులు ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. సమావేశంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా నరసింహారావు ఆర్థిక కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు, నాయకులు డీవీ జోసెఫ్, పేరేచర్ల శ్రీనివాసరావు జి.జోజప్ప, వై.శ్యాంబాబు, కేవీ రమణ, ఎం.శ్రీనివాసరావు, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రాజేంద్రప్రసాద్‌కు బయోడైవర్సిటీ కన్సర్వేటర్ అవార్డు

పాత గుంటూరు: డాక్టర్ పట్టాభి కవపీఠం, నవ్యాంధ్ర రచయితల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ యేనుబూరి రాజేంద్రప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వ బయో డైవర్సిటీ బోర్డు (జీవన వైవిధ్య మండలి) ఏటా అందించే బయో డైవర్సిటీ కన్సర్వేటర్ అవార్డును అందుకున్నారు. సోమవారం తిరుపతి పశువైద్య విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బోర్డు చైర్మన్ డాక్టర్ బి.ఎం.కె. రెడ్డి, డాక్టర్ కె. గోపీనాథ్, వెటర్నరీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.రవి నుంచి రాజేంద్రప్రసాద్ అవార్డును అందుకున్నారు. రాజేంద్రప్రసాద్ పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్నందుకు ఈ అవార్డు దక్కింది. ఆయనకు అవార్డు దక్కడంపై పలువురు రచయితలు, సాహిత్యాభిమానులు అభినందనలు తెలిపారు.

వైభవంగా ఆంజనేయస్వామి కల్యాణం

తెనాలిటౌన్: షరాఫ్ బజార్‌లో వేంచేసియున్న శ్రీ సువర్చలా సమేత వరద వచుఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం హనుమత్ సువర్చలా కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వంశ పారంపర్య అర్చకులు ఆర్ శ్రీనివాసమూర్తి నేతృత్వంలో వైదిక బ్రత్విజులు అర్చకులు కిరణ్, సురేష్ జరిపారు. తెలుగు పండితులు ములుకుట్ల విశ్వనాథశర్మ ప్రవచనం చేయగా, సంకీర్తన బృందం సభ్యులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

రేషన్ పరేషాన్‌కు చెక్

- గర్భిణులు, బాలింతల ఇంటికే పోషకాహారం
- అంగన్‌వాడీ కేంద్రాల్లో జూలై నుంచి టీహెచ్‌ఆర్ అమలు
- మాతా,శిశు సంరక్షణపై ఏపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు టీహెచ్‌ఆర్ కింద అందిస్తున్న సరుకులు (ఫైల్)

ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు

అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనం స్థానంలో జూలై నుంచి పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఇంటికే ఇవ్వనున్నాం. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చాయి. ఇలా టేక్ హోం రేషన్ ద్వారా ఇంటికే సరుకుల్ని ఇవ్వడం వల్ల ప్రతి ఒక్కరూ కచ్చితంగా పోషకాహారాన్ని తింటారు. లబ్ధిదారులు ఆరోగ్యంగా ఉంటారు.

– వి. సుజాతాదేవి (సీడీపీవో, ఐసీడీఎస్ ప్రాజెక్టు, ప్రత్తిపాడు)

ప్రత్తిపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో మరోసారి టీహెచ్‌ఆర్ (టేక్ హోం రేషన్) విధానం అమలు కానుంది. బాలింతలు, గర్భిణుల్లో రక్తహీనతను అధిగమించేందుకు, వారి సంపూర్ణ ఆరోగ్యం కోసం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తున్నారు. కేంద్రాల్లో మధ్యాహ్న భోజనం తినేందుకు కొందరు ఆసక్తి చూపకపోతుండటంతో పాటు, వచ్చేందుకు కూడా విముఖత చూపుతున్నారు. దీంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా ఏపీ సర్కార్ ఎండీఎం స్థానంలో లబ్ధిదారులకే నేరుగా ఇంటికే సరుకుల్ని ఇవ్వనుంది. ఈ మేరకు వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. ఐటీడీఏ చేసిన అభిప్రాయ సేకరణలో అత్యధికులు సరుకుల్ని ఇంటికే ఇవ్వాలనే అభిప్రాయాన్ని వెల్లడించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

కరోనా సమయంలో మాదిరిగా..

కరోనా సమయంలో రెండేళ్ల పాటు టీహెచ్‌ఆర్ పేరుతో లబ్ధిదారులకు సరుకుల్ని ఇళ్ల దగ్గరే ఇచ్చారు. కోవిడ్ తీవ్రత తగ్గుముఖం పట్టడంతో అంగన్‌వాడీ కేంద్రాలు యథావిధిగా తెరుచుకోవడం, అక్కడే ఎండీఎం వండి గర్భిణులు, బాలింతలకు ఆహారాన్ని నిర్దేశిత మెనూ ప్రకారం అందిస్తున్నారు. తాజాగా అత్యధికులు ఇంటికే సరుకులు ఇవ్వాలని కోరడంతో ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

జూలై నుంచి ఇంటికే ఇవ్వనున్న సరుకులు ఇవే..

- బియ్యం: 3 కేజీలు ■ కందిపప్పు: 1 కేజీ
- నూనె: 500 ఎం.ఎల్.
- కోడిగుడ్లు: 13 (ఫేజ్–1) (ప్రతి నెలా 1 నుంచి 5 వరకు)
- పాలు: 2.5 లీటర్లు (ఫేజ్–1) (ప్రతి నెలా 1 నుంచి 5 వరకు)
- రాగి పిండి: 2 కేజీలు ■ అటుకులు: 1 కేజీ
- బెల్లం: 250 గ్రాములు ■ చిక్కీలు: 250 గ్రాములు
- ఎండు ఖర్జూరం: 250 గ్రాములు
- కోడిగుడ్లు: 12 (ఫేజ్–2) (ప్రతి నెలా 16 నుంచి 17 వరకు)
- పాలు: 2.5 లీటర్లు (ఫేజ్–2) (ప్రతి నెలా 16 నుంచి 17 వరకు)

ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టులో గర్భవతులు, బాలింతల వివరాలు

మండలం	గర్భవతులు	బాలింతలు
ప్రత్తిపాడు	287	210
పెదనందిపాడు	192	158
వట్టిచెరుకూరు	232	240
కాకుమాను	151	130
గుంటూరురూరల్	247	215
మొత్తం	1109	953

ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టులో చిన్నారుల వివరాలు

మండలం	6–36 నెలలు	36–72 నెలలు
ప్రత్తిపాడు	1291	588
పెదనందిపాడు	813	568
వట్టిచెరుకూరు	1012	594
కాకుమాను	797	512
గుంటూరురూరల్	1120	505
మొత్తం	5033	2767

వలంటీర్ల సేవలకు సెల్యూట్

- ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులు వారే
- ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



ప్రత్తిపాడు టీజేఆర్ జెడ్పీ హైస్కూల్లో వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే సుచరిత, ఎంపీపీ అన్నమ్మ తదితరులు

ప్రత్తిపాడు: గ్రామ వలంటీర్లు ప్రజలకు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత అన్నారు. ప్రత్తిపాడులోని టీజేఆర్ వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సేవారత్నలుగా ఎంపికైన షేక్ మహబూబ్ సుభాని (ప్రత్తిపాడు–3), ముమ్మ రాజేష్ (తుమ్మలపాలెం), నేలపాటి రాజారత్నం (నడింపాలెం), సీహెచ్ సోనియా కస్తూరి (కోయవారిపాలెం), ఎం మణికంఠ పవన్‌కుమార్ (యనమదల)లతోపాటు సేవామిత్రలుగా ఎంపికైన 219 మంది వలంటీర్లను సుచరిత దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. అనంతరం సుచరిత మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో చేసిన అవినీతి, పక్షపాత వైఖరికి చెక్ పెడుతూ, అర్హతే ప్రామాణికంగా, పారదర్శకంగా అవినీతిరహితంగా ప్రభుత్వ పథకాలు, సేవలను అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ప్రజల ముంగిటకు తీసుకువచ్చారని పేర్కొన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ వలంటీర్లు అందించిన సేవలు ఎప్పటికీ మరిచిపోలేనివని ఎమ్మెల్యే గుర్తుచేశారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా వలంటీర్లు గృహాల మ్యాపింగ్ చేసినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఏ గడప తొక్కినా వలంటీర్ సేవలను ప్రశంసిస్తున్నారని చెప్పారు. గతంలో పింఛన్లు తీసుకోవాలంటే వృద్ధులు నానా ఇబ్బందులు పడాల్సి వచ్చేదని, కానీ నేడు ఆ పరిస్థితి లేకుండా ఒకటో తేదీనే వలంటీర్ లబ్ధిదారుల తలుపు తట్టి పింఛను ఇస్తున్నది దేశంలోనే మన ఒక్క రాష్ట్రంలో మాత్రమేనన్నారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వానికి చేరువ చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అన్నమ్మ, ఎంపీడీఓ శ్రీరమ్య, ఎంపీటీసీ సభ్యులు జి.సాయి, బూసి సువార్తమ్మ, ప్రత్తిపాడు ఉపసర్పంచ్ బి.వెంకటేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ బావను వెంకటరావు, నవీలావలపాడు మండల కన్వీనర్ ఎల్. లక్ష్మారెడ్డి, పార్టీ రైతు విభాగం జిల్లా కన్వీనర్ ఓంప్రకాశ్‌రెడ్డి, సేవాదళ్ జిల్లా కన్వీనర్ మురళి, గ్రామ అభివృద్ధి కమిటీ మెంబర్ జి.వరమారెడ్డి, నడింపాలెం సర్పంచ్ లాం రత్నకుమార్, పార్టీ నాయకులు జి.శివారెడ్డి, కవిత, పిల్లి మేరి, జి.సుబ్బారావు, వి. అమృతయ్య, కె.సుబ్బారావు, వి.మధు తదితరులు పాల్గొన్నారు.

కూతురే చిత్రహింసలు పెడుతోంది

ఎమ్మెల్యే సుచరిత ఎదుట ఓ వృద్ధురాలి ఆవేదన



ఎమ్మెల్యే సుచరిత వద్ద గోడు వెళ్లబోసుకుంటున్న వృద్ధురాలు ఆదిలక్ష్మి

ప్రత్తిపాడు: 'నా ఇంట్లో ఉంటూ.. నన్ను ఇంట్లోకి రానివ్వకుండా నా చిన్న కూతురు చిత్రహింసలు పెడుతోంది' అంటూ ఓ వృద్ధురాలు ఎమ్మెల్యే సుచరిత వద్ద ఆవేదన వ్యక్తంచేసింది. బాధితురాలి కథనం ప్రకారం.. ప్రత్తిపాడుకు చెందిన 75 ఏళ్ల వృద్ధురాలు ఆదిలక్ష్మికి ఇద్దరు కుమార్తెలు, తాడికొండకు చెందిన పెద్ద కుమార్తె ఇద్దరు కొన్నేళ్ల కిందట చిన్న కుమార్తెకు వివాహం చేసింది. వారికి సొంతిల్లు లేదని, ఇల్లు నిర్మించుకునేంత వరకు ఇక్కడ ఉంటామంటూ చిన్న కూతురు కుటుంబం ప్రత్తిపాడులోని తల్లి పంచన చేరింది. నెలలు గడిచినా ఇంటి నుంచి కదలకుండా తిష్ట వేసుకుని ఉండటంతోపాటు తల్లి ఆదిలక్ష్మిని ప్రతి రోజూ తిడుతూ, కొడుతూ నానా చిత్రహింసలు పెడుతున్నారు. దీంతో బాధలు భరించలేని వృద్ధురాలు కొద్ది నెలల కిందట ప్రత్తిపాడు పోలీసులను ఆశ్రయించినా ఫలితం లేకపోయింది. తాజాగా రెండు నెలల కిందట ఆమెను వివిధరకాల చిత్రహింసలు పెట్టి తన్ని ఇంట్లో నుంచి తరిమెయ్యడంతో గాయాలపాలైన వృద్ధురాలు ఆస్పత్రి పాలయ్యింది. చికిత్స పొందుతూ రెండు రోజుల క్రితం ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చిన ఆమెను మళ్లీ చిన్న కూతురు కుటుంబం హింసిస్తుండటంతో, ఏమి చేయాలో పాలుపోని ఆ వృద్ధురాలు స్థానిక నేతలు సాయంతో మంగళవారం ప్రత్తిపాడు వచ్చిన ఎమ్మెల్యేను కలిసి తన గోడును వెళ్లబోసుకుంది. తనను కాపాడాలని వేడుకుంది. దీంతో చలించిన సుచరిత ఎస్ఐ రవీంద్రను పిలిచి, నాలుగు రోజుల్లో వృద్ధురాలి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. చిన్న కూతురు కుటుంబం ఆదిలక్ష్మి జోలికి రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

విగ్రహ దిమ్మె కూల్చివేతపై ఆందోళన



ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నాయకులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

గుంటూరు రూరల్: విగ్రహ దిమ్మె కూల్చివేతపై దళిత సంఘాలు ఆందోళన చేసిన ఘటన నగర శివారుల్లోని గోరంట్ల గ్రామంలో జరిగింది. గతంలో గ్రామంలోని మేరీప్రియనగర్ సమీపంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపన చేసి దిమ్మెను ఏర్పాటు చేశారు. దిమ్మె, విగ్రహ ఏర్పాటుకు నగర కార్పొరేషన్ అనుమతి లేదనే ఉద్దేశంతో అధికారులు దిమ్మెను ధ్వంసం చేశారని స్థానిక ప్రజలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యక్షంగా వారు ఆందోళన చేశారు. విషయం తెలిసిన నల్లపాడు సీఐ శ్రీనివాసరావు ఘటన స్థలికి చేరుకుని ఆందోళన విరమించాలని సర్దిచెప్పారు. ఆందోళన విరమించకపోవటంతో మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత భర్త మాజీ ఐఆర్ఎస్ దయాసాగర్ కలగజేసుకుని మళ్లీ అన్ని అనుమతులతో విగ్రహం ఏర్పాటుకు కృషిచేస్తామని హామీ ఇవ్వటంతో ప్రజా సంఘాల నాయకులు నిరసనను విరమించుకున్నారు.

నగరంపాలెం పీఎస్ ఎస్ఐ సస్పెన్షన్

నగరంపాలెం: నగరంపాలెం పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రవితేజను సస్పెండ్ చేశారు. పల్నాడు జిల్లా రెంటచింతల మండలానికి చెందిన ఓ యువతి ఉన్నత విద్య కోసం శిక్షణ పొందుతూ గుంటూరులోని ఓ ప్రైవేట్ వసతిగృహంలో ఉంటుంది. ఆమె ఎస్ఐ మోసగించారంటూ ఈనెల 20న నగరంపాలెం పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఈ క్రమంలో ఎస్ఐ రవితేజను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ ఉత్తర్వులు జారీచేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చేబ్రోలు: గుర్తుతెలియని కారు బైక్‌ను ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన చేబ్రోలు మండలం నారాకోడూరులో మంగళవారం జరిగింది. పాతరెడ్డిపాలెం గ్రామానికి చెందిన షేక్ సుభాని బైక్‌పై నారాకోడూరులో పెట్రోలు బంక్‌లో నుంచి ద్విచక్ర వాహనంపై బయటకు వస్తున్నారు. వేగంగా వచ్చిన గుర్తు తెలియని కారు ఢీ కొట్టింది. ఘటనలో సుభాని కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి.

నేటి సాయంత్రం తాగునీటి సరఫరాలో అంతరాయం

నెహ్రూనగర్: పశ్చిమ నియోజకవర్గంలో నేటి సాయంత్రం తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని నగర పాలక సంస్థ ఎస్ఈ భాస్కర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలో తాగునీటి సరఫరాపై ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు, లీకులు మరమ్మతులు చేసి మెరుగైన సరఫరా అందించేలా చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ ఇచ్చిన ఆదేశాల మేరకు నెహ్రూనగర్ నుంచి లక్ష్మీపురానికి సరఫరా అయ్యే 800 డయా పైప్‌లైను సంజీవయ్య నగర్ రైల్వే గేటు వద్ద ఏర్పడిన లీకును బుధవారం మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు. దీనివల్ల బుధవారం సాయంత్రం పశ్చిమ నియోజకవర్గంలోని లక్ష్మీపురం, స్తంభాలగరువు, గుజ్జనగుండ్ల, ఏటి అగ్రహారం, ఏఎంసీ, హౌసింగ్ బోర్డు, కోర్టు కాంపౌండ్, కేవీపీ కాలనీ, వికాస్ నగర్, శ్యామల నగర్, హనుమయ్య నగర్ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎస్ఈ వివరించారు.

'యాప్'లోన్ తీర్చలేక మరో యువకుడు మృతి..

గడ్డి మందు తాగడంతో.. రేపల్లె వైద్యశాలలో చికిత్స

వారం రోజులు మృత్యువుతో పోరాటం..



రేపల్లె రూరల్: గడ్డి మందు తాగి యువకుడు మృతి చెందిన ఘటన పెనుమూడి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సురేష్ వివరాల మేరకు నగరం మండలం గొడపాలేనికి చెందిన చెన్ను సాయి(22) కొంతకాలంగా రేపల్లె మండలంలోని పెనుమూడి పాలెంలో తన తండ్రి నాగమల్లేశ్వరరావు వద్ద ఉంటున్నాడు. డిగ్రీ పూర్తయిన తర్వాత ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూ ఆన్‌లైన్ యాప్ ఎం పాకెట్ ద్వారా రెండేళ్ల క్రితం రూ.40వేలు లోన్ తీసుకున్నాడు. కొంత కాలంగా ఎం పాకెట్ నిర్వాహకులు తీసుకున్న అప్పు తిరిగి చెల్లించాలని ఒత్తిడి చేశారు. డబ్బులు కట్టలేక మనస్తాపం చెంది.. ఈ నెల 16న గడ్డిమందు తాగాడని తెలిపారు. సాయిని రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటి నుంచి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని వివరించారు. తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఎన్జీ రంగా వర్సిటీ వీసీకి సన్మానం



వీసీ డాక్టర్ ఎ విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగులు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని వివిధ పరిశోధన స్థానాలు, కళాశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది, కాంట్రాక్ట్ వర్కర్స్, సెక్యూరిటీ స్వీపర్స్, డ్రైవర్స్, అటెండర్స్ తదితరులకు వేతనాలు పెంచిన సందర్భంగా మంగళవారం వేడుకలు నిర్వహించారు. నగర శివారుల్లోని లాంఫాంలోని విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాన్ టీచింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీసీ డాక్టర్ ఎ. విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానించారు. వీసీ మాట్లాడుతూ వర్సిటీ వృద్ధికి అందరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎమ్.ఎల్ కుమార్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు కె అమ్మిరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ జె విజయసారథి, ట్రెజరర్ ఎమ్ నరసింహ, జనరల్ సెక్రటరీ ఆర్ విజయకుమార్, నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు పొన్నూరులో టిడ్కో ఇళ్ల పంపిణీ



ప్రారంభోత్సవానికి సిద్ధమైన టిడ్కో గృహాలు

పొన్నూరు(చేబ్రోలు): పట్టణ పరిధిలోని నిడుబ్రోలులో నిర్మించిన 1,660 గృహాలను తొలి విడతగా బుధవారం ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాదారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 2368 టిడ్కో గృహాలకు గాను, ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో 1660 గృహాలు పూర్తి అయినట్లు చెప్పారు. ప్రారంభోత్సవానికి రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, ప్రభుత్వ చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఏపీ టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీధర్, జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి హాజరవుతారని చెప్పారు. మిగిలిన లబ్ధిదారులకు రెండో విడతలో టిడ్కో గృహాలు అందజేయనున్నట్లు చెప్పారు.

సీనియర్ రెసిడెంట్ ఉద్యోగాలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలలో సీనియర్ రెసిడెంట్ వైద్యుల ఉద్యోగాలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ ఉమా జ్యోతి చెప్పారు. ఈనెల 26న మధ్యాహ్నం 2 గంటలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. క్లీనికల్, నాన్ క్లీనికల్, స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ చదివిన పీజీ వైద్యులు సీనియర్ రెసిడెంట్ ఉద్యోగాలకు అర్హులన్నారు. పూర్తి వివరాలకు గుంటూరు మెడికల్ కాలేజ్.ఎడ్యూ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

అధిక చార్జీలు వసూలు చేయవద్దు

పొల్యూషన్ టెస్టింగ్ నిర్వాహకులకు డీటీసీ ఆదేశం



పట్టాభిపురం(గుంటూరు ఈస్ట్): పొల్యూషన్ సర్టిఫికెట్ జారీ చేసే సమయంలో అధిక చార్జీ వసూలు చేయకూడదని డీటీసీ షేక్ కరీం చెప్పారు. ఈమేరకు నల్లపాడురోడ్డులోని ఆర్టీఏ కార్యాలయంలో పొల్యూషన్ నిర్వాహకులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ పొల్యూషన్ టెస్టింగ్ చార్జీలను పెంచేందుకు ఏపీ పొల్యూషన్ టెస్టింగ్ సెంటర్ అసోసియేషన్ సభ్యులు అందజేసిన వినతి పత్రం పరిశీలించి జిల్లా అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ప్రతి ఒక్క వాహనదారుడికి స్పష్టంగా సేవలందించడంతోపాటు సర్టిఫికెట్లను జాగ్రత్తగా అందజేయాలన్నారు. సమావేశంలో పొల్యూషన్ టెస్టింగ్ అసోసియేషన్ సెంటర్ సభ్యులు పలువురు పాల్గొన్నారు.

నేడు టెన్త్ ప్రతిభావంతులకు మాస్టర్‌మైండ్స్ ప్రతిభా పురస్కారాలు



మట్టుపల్లి మోహన్ (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: ఇటీవల జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బుధవారం ప్రతిభా పురస్కారాలు బహూకరిస్తున్నట్లు మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి స్టేట్, ఐసీఎస్ఈ సిలబస్‌లలో 550కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు సీబీఎస్ఈ సిలబస్‌లో 450కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించి, వారికి నగదు బహుమతి అందజేయనున్నట్లు తెలిపారు. బుధవారం సాయంత్రం పదిగంటలకు తెనాలి, చిలకలూరిపేట, సత్తెనపల్లి పట్టణాల్లో ప్రతిభా పురస్కార ప్రదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతిభా పురస్కార కార్యక్రమానికి హాజరు కాగోరు విద్యార్థులు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకుని, ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న కార్యక్రమాలకు తమ తల్లిదండ్రులతో సహా హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రం, కొత్తపేట, తెనాలి. సెల్ నంబర్లు: 92487 22218, 77803 90139, శ్రీకొండవీటి స్వామి ఆర్యవైశ్య కళ్యాణ మండపం, పాత గవర్నమెంట్ ఆస్పత్రి వద్ద, పురుషోత్తమ పట్నం రోడ్డు, చిలకలూరిపేట. సెల్ నంబర్లు: 91000 69428, 91212 10582, మేడా విశ్వేశ్వరరావు ఏసీ ఫంక్షన్ హాల్, సిండికేట్ బ్యాంక్ బిల్డింగ్, వెంకటేశ్వరస్వామి గుడి ప్రక్కన, సత్తెనపల్లి. సెల్ నంబర్లు: 92487 22281, 88850 40515లలో సంప్రదించాలని సూచించారు.

ఫేస్‌బుక్ పోస్టుపై కేసు

గుంటూరు ఈస్ట్: గుర్తుతెలియని వ్యక్తి ఒక పోస్టర్ మార్ఫింగ్ చేసి నిందిస్తున్నట్లు ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టాడు. ఈఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి ఫేస్‌బుక్ అంజమ్మనగర్‌లో నివసించే రమేష్ అనే పోస్టర్ మరో పోస్టర్ అద్దంకి రంజిత్ ఓఫీర్‌ను నిందిస్తున్నట్లు పోస్టు చేశాడు. దీంతో పోస్టర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

గుంటూరు ఈస్ట్: వివాహిత కనిపించకుండా పోయిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. విద్యానగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న వ్యక్తి భార్య సోమవారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆమెకోసం వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో భర్త మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి అదృశ్యంపై కేసు

గుంటూరు ఈస్ట్: వృద్ధురాలు కనిపించకుండా పోయిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఏటి అగ్రహారానికి చెందిన 65 సంవత్సరాల కుప్పాల సామ్రాజ్యం ఈనెల 18న ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం ఎంత వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో కుమారుడు రాంబాబు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.